నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 10 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

రేవంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- పదేండ్లు సీఎంగా చేసిన కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు ఆక్షేపణీయం
- సీఎం రేవంత్‌పై వెంటనే కేసు నమోదు చేయాలి
- ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- పార్టీ శ్రేణులతో కలిసి ఖమ్మం టూటౌన్ సీఐకి ఫిర్యాదు

ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

ఖమ్మం, నవంబర్ 9 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్‌పై అనుచిత, అభ్యంతర, అవమానకర వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ నగర, జిల్లా నాయకులతో కలిసి ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద తాతా మధు మాట్లాడుతూ మూసీ నది వెంట పాదయాత్ర సందర్భంగా సీఎం రేవంత్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగడం ఆక్షేపణీయమన్నారు. పదేండ్లు సీఎంగా పనిచేసిన ఒక వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేశారని అన్నారు. కేసీఆర్ ప్రతిష్టను భంగపరిచేలా ఉన్నందున రేవంత్‌రెడ్డిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటం, ఆయన నాయకత్వం ప్రజలకు స్ఫూర్తిదాయకమని, అలాంటి వ్యక్తిని అవమానపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. అనుచిత వ్యాఖ్యలను రేవంత్ వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక వారిని ఏమారుస్తున్నారని అన్నారు. అధికారం ఉంది కదా అని విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డి తన తీరును మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీకి రేవంత్‌రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటో రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలిపిన శుభాకాంక్షలతోనే తేలిపోయిందని, రేవంత్‌రెడ్డికి కనీసం కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ పెద్దలు ఏ ఒక్కరు శుభాకాంక్షలు తెలపకపోవడం ఆ పార్టీలో రేవంత్‌రెడ్డికి ఉన్న గౌరవాన్ని తెలుపుతుందన్నారు. తాతా మధుతోపాటు బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మంరూరల్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మాదంశెట్టి వీరభద్రం, నున్నా శ్రీనివాసరావు, బంక మల్లయ్య, ముత్యాల వెంకటప్పారావు, పగడాల నరేందర్, డేరంగుల బ్రహ్మం, కోటి అనంతరాములు, సిద్దాం షేక్, బొడ్డు గ్లోరీ, మద్దెల విజయ్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వైరాటౌన్, నవంబర్ 9 : రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ అన్నారు. వైరా వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను దళారులకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తుందన్నారు. ఆయన వెంట డీఎస్‌వో చందన్‌కుమార్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

ఇసుక తోలకాలకు అనుమతి ఇవ్వాలి

ఎడ్లబండ్ల కార్మికులకు అండగా నిలిచిన జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

అధికారులతో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిర, నవంబర్ 9 : మధిర ప్రాంతంలో ఎడ్లబండ్లతో ఇసుక తోలకాలను అధికారులు అడ్డుకోవడం సరికాదని, వారికి అనుమతి ఇవ్వాలని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం మధిర ప్రాంతంలో ఇసుక తోలుతున్న ఎడ్ల బండ్ల కార్మికులను అధికారులు అడ్డుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న కమల్‌రాజు.. బీఆర్ఎస్ శ్రేణులతో వెళ్లి వారికి మద్దతుగా నిలిచారు. తహసీల్దార్, సీఐతో మాట్లాడి వారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తోలకాలకు ఉమ్మడి రాష్ట్రంలోనే అనుమతి ఇస్తూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చిన జీవో విషయాన్ని గుర్తు చేస్తూ జీవో కాపీలను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అవసరాలకు ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తోలడం నేరమా.. అని ప్రశ్నించారు. తక్షణమే ఇసుక తోలకాలను అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మధిర సహకార సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్, మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల, పట్టణ పార్టీ కార్యదర్శులు అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు యన్నం శెట్టి అప్పారావు, ఇక్బాల్, నాయకులు ఆళ్ల నాగబాబు, జేవీ రెడ్డి, కపిలవాయి జగన్మోహన్‌రావు, జగన్నాథాచారి, పరిష శ్రీనివాసరావు, చిదిరాల రాంబాబు తదితరులు ఉన్నారు.

సర్వేపై విస్తృతంగా ప్రచారం చేయాలి

- కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలి
- ఖమ్మం సారథి నగర్‌లో ఇంటింటి సర్వేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్

ఖమ్మం, నవంబర్ 9 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి కుటుంబం వివరాలు పూర్తిస్థాయిలో సేకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం నగరంలోని సారథి నగర్‌లో ఎన్యూమరేటర్లు, అధికారులతో కలిసి కలెక్టర్ ఇంటింటికీ తిరుగుతూ సర్వే ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేలో ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సర్వేపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాలు రద్దు చేయరనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. సర్వేలో ప్రతి కుటుంబం పాల్గొనాలని, ఏ ఒక్క ఇంటిని వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పై అధికారులకు ఎన్యూమరేటర్లు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బడి బకాయిలు ఇప్పించండి..!

- 'మన ఊరు-మన బడి' పనులకు విడుదల కాని నిధులు
- విముఖత చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- అప్పులు చేసి చేపట్టిన పనులు.. ఆర్థిక ఇబ్బందుల్లో గుత్తేదారులు

లేదంటే మాకు ఆత్మహత్యే శరణ్యం

ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులు

ఖమ్మం, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు గత కేసీఆర్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలన్నీ కొత్తందాన్ని సంతరించుకున్నాయి. నూతన హంగులతో శోభాయమానంగా ముస్తాబయ్యాయి. 'మన ఊరు-మన బడి' కింద గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఆ నిధులను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ విడుదల చేయకపోవడంతో పనులు చేపట్టిన గుత్తేదార్లు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కాలంగా బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. 'బడి' బకాయిలు ఇప్పించండి సారూ..! అంటూ అధికారులను వేడుకుంటున్నారు. పనులు చేసే సమయంలో వెంటపడి చేయించిన అధికారులు.. పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోమంటే చేతులెత్తేస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అప్పులు తెచ్చి పనులు చేపట్టామని.. వాటికి వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన చెందుతున్నారు. చేసిన పనులకు బిల్లులు ఇప్పించండి మహాప్రభో..! అంటూ నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాంట్రాక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని తీరుపై 'నమస్తే తెలంగాణ' కథనం.

426 స్కూల్స్‌లో పనులు..

ప్రభుత్వ బడుల దిశ, దశ మార్చాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మన ఊరు-మన బడి/మన ఊరు-మన బస్తీ పథకాన్ని నిలుపుదల చేశారు. దాని స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలలు అంటూ మరో పథకాన్ని నిర్వహిస్తున్నారు. మన ఊరు-మన బడి పథకంతో సర్కార్ బడులు ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్నాయి. ఒక్క సమస్య కూడా ఉత్పన్నం కాకుండా అన్ని సదుపాయాలు సమకూర్చారు. పూర్తిస్థాయిలో ఆధునికీకరణ, మౌలిక వసతులు, నీటి వసతితో కూడిన అత్యాధునిక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కార్పొరేట్ స్కూల్స్‌కే పరిమితమైన అత్యాధునిక ప్రమాణాలతో కూడిన పరికరాలను ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులోకి తెచ్చారు. నీటి సరఫరా, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నిచర్, పెయింటింగ్, మరమ్మతులు, ఆకుపచ్చ రాత బోర్డులు, ప్రహరీ, వంట గది, నూతన తరగతి గదులు, భోజన శాల, డిజిటల్ సౌకర్యాలను సమకూర్చి పనులు పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 426 స్కూల్స్‌లో పనులు నిర్వహించింది.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..

మన ఊరు-మన బడిలో భాగంగా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులను కలుస్తూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. ఇప్పటికీ పదుల సంఖ్యలో వినతిపత్రాలు ఇచ్చి తమ బిల్లులు చెల్లించాలని కోరినా కరుణించిన వారు లేరు. పనులు పూర్తి చేసేవరకు ఉరుకులు పెట్టించిన అధికారులు ఇప్పుడు తమ చేతుల్లో ఏమీ లేదు, ప్రభుత్వం నిధులు కేటాయించట్లేదని కాంట్రాక్టర్లకు చెబుతుండడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో గుత్తేదారులు ఉండిపోయారు. కనిపించిన ప్రతి ప్రజాప్రతినిధులను తమ బిల్లులు ఇప్పించాలని విన్నవించుకుంటున్నా స్పందించే నాధుడే కరువయ్యాడని వాపోతున్నారు. రూ.లక్షలు చెల్లించి ప్రభుత్వ పనులు చేసి బిల్లుల కోసం అందరి చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంపై నిట్టూరుస్తున్నారు.

రూ.6.2 కోట్లు రావాలి..

మన ఊరు-మన బడి పథకం ద్వారా 12 అంశాల్లో పనులు నిర్వహించగా.. నిర్మాణాలకు సంబంధించినవి కాకుండా మిగిలినవి రాష్ట్ర స్థాయి నుంచే సరఫరా చేశారు. అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు, టాయిలెట్స్, డైనింగ్ హాల్ వంటివి జిల్లాస్థాయిలో కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేశారు. పనులు పూర్తి చేసి సంవత్సరంన్నర పూర్తయిన బిల్లులు మాత్రం చేతిలో పడని దుస్థితి. జిల్లాలో 426 స్కూల్స్‌కి రూ.33.46 కోట్లు మంజూరు చేయగా.. వాటిల్లో రూ.23.76 కోట్లు గత కేసీఆర్ ప్రభుత్వం చెల్లింపులు చేసింది. వీటిల్లో రూ.3.5 కోట్లు పనుల అడ్వాన్స్‌ల కోసం అందజేసింది. పనులు పూర్తి చేసినా ఇంకా రూ.6.2 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోతే జిల్లావ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు స్కూల్స్‌కి తాళం వేసే ఆలోచనలో ఉన్నారు. దీంతోపాటు వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యమని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

రూ.30 లక్షలు రావాలి...

ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ పాఠశాలలో రూ.30 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించాను. గత ఏడాది ఆగస్టులోనే నిర్మాణం పూర్తి చేసి పాఠశాలను అందజేశాను. అప్పటినుంచి కలెక్టర్, డీఈవోల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. వీటితోపాటు డైనింగ్ హాల్ పూర్తి చేశా.. దానికి సీలింగ్ కూడా చేసిన పనికి సంబంధించిన మంజూరు కూడా ఇవ్వడం లేదు. అప్పటి కలెక్టర్ గౌతమ్ స్కూల్‌ని పరిశీలించి బాగుంది అని అభినందించారు. కానీ.. డబ్బులు మాత్రం రావడం లేదు. మా ఆర్థిక పరిస్థితి బాగోలేదు.. బిల్లులు రాకపోతే ఆత్మహత్యే శరణ్యం.. దీనికి ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలి.

- కొత్తా రవికుమార్, కాంట్రాక్టర్

కబ్జాల పంట!

- యథేచ్ఛగా పెదవాగు ప్రాజెక్టు లోతట్టు భూముల ఆక్రమణ
- ట్రాక్టర్లతో పొడి దుక్కులు దున్ని సాగు చేస్తున్న రైతులు
- చోద్యం చూస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు
- ఆక్రమణలపై మంత్రులు ఆదేశించినా చర్యలు కరువు
- సాగునీరు అందక ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

పెదవాగు ప్రాజెక్టు పరిధిలో దున్ని సాగు చేస్తున్న భూములు

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 9 : గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు పరిధిలో గల లోతట్టు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు రైతులు యథేచ్ఛగా ఆక్రమించి సాగు చేసుకుంటున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టు లోతట్టు భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల, పొంగులేటి నీరుపారుదల శాఖ అధికారులను ఆదేశించినా.. ఆక్రమణల పరంపర మాత్రం ఆగడం లేదు. గుమ్మడవల్లి గ్రామ సమీపంలోని పెదవాగు ప్రాజెక్టుకు ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు, ఎగువ నుంచి వచ్చిన వరదలతో గండిపడి నీరంతా వృథాగా దిగువకు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే గండిపడిన ప్రాంతంలో అధికారులు రింగ్ బండ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు పారించుకుంటూ రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న భూమిపై కన్నేసిన ఖమ్మంపాడు, మేకలబండ, కోయరంగాపురం, వడ్డెర రంగాపురం, బచ్చువారిగూడెం గ్రామాలకు చెందిన రైతులు ట్రాక్టర్‌తో దుక్కులు చేసి నువ్వు, మినుము పంటలు సాగు చేస్తున్నారు. ఇలా పంటలు సాగు చేయడం వల్ల ప్రాజెక్టు నీటి నిల్వ ప్రాంతం అంతా పూడికతో నిండిపోతుందని, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి సాగునీటి సమస్య తలెత్తుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.


భారీ వర్షాలతో కొట్టుకుపోయిన ప్రాజెక్టు కట్ట (ఫైల్)

మంత్రులు రివ్యూలు చేసినా ఫలితం లేదాయె..

ఇటీవల ప్రాజెక్టు వద్ద జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి మంత్రులు తుమ్మల, పొంగులేటి రివ్యూలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు లోతట్టు ప్రాంతంలో పొడి దుక్కులు దున్నడం వల్ల ఇప్పటికే అశ్వారావుపేట మండలంలో 2 వేల ఎకరాలు, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కుడి, ఎడమ కాల్వల ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టు 8 వేల ఎకరాలకు కూడా నీరు అందించలేకపోతున్నదని రైతులు వాపోతున్నారు. దీంతో ప్రాజెక్టు లక్ష్యం నీరుగారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెదవాగు ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణలు గుర్తించి.. హద్దులు నిర్ణయించాలి..

పెదవాగు ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలు గుర్తించి ఆయా రైతులపై చర్యలు తీసుకోవాలని, చుట్టూ హద్దులు నిర్ణయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టులో పూడిక తీసి సాగు భూములకు ఆ మట్టిని తోలుకుంటే బాగుంటుందని, కానీ.. రైతులు ఆ పని చేయకుండా ప్రాజెక్టు లోతట్టు భూములు సారవంతంగా ఉంటాయనే ఉద్దేశంతో ఆక్రమించి సాగు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు. దీనిపై జిల్లా మంత్రులకు ఫిర్యాదు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

కాల్వ ద్వారా ఆయకట్టు భూములకు అందిస్తున్న నీరు

సర్వే అధికారులకు సహకరించండి

ఇల్లెందు జేకే కాలనీ సర్వే పరిశీలనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఆసుపత్రిలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు, నవంబర్ 9 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే అధికారులకు యజమానులు కుటుంబ వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఇల్లెందు పట్టణం జేకే కాలనీలో ఇంటింటి సర్వేను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే కొరకు మీ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు నిర్భయంగా వివరాలు చెప్పొచ్చన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం కొరకు నిర్వహిస్తున్న సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రిలో జూలై నెలలో చేపట్టిన టీజీ ఐఎంఐడీసీ పనులను పరిశీలించిన కలెక్టర్.. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో ధన్‌సింగ్, ఆర్ఐ కామేశ్ పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు జోహార్లు
విధినిర్వహణలో అసువులు బాసిన అటవీ శాఖ అమరవీరులకు జోహార్లు....
అటవీ డివిజనల్ అధికారి కార్యాలయం
పాల్వంచ డివిజన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616